ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
మంగళవారం 16 డిసెంబరు 2025 www.prajaswaramdailly.com 1pm

# నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌కు ఉపశమనం

**ఢిల్లీ, ప్రజాస్వరం**



నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకు ఊరట లభించింది. ఈ కేసులో రాహుల్, సోనియాను విచారించేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఈ కేసులో వీరిద్దరితో పాటు మరో ఐదుగురిపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ దాఖలు చేసిన ఛార్జ్ షీట్ ను పరిగణనలోకి తీసుకునేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఈ కేసు లో ఈడీ తమ దర్యాప్తును కొనసాగించొచ్చని న్యాయస్థానం తెలిపింది. ప్రైవేటు వ్యక్తి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ నేషనల్ హెరాల్డ్ కేసులో దర్యాప్తు జరిపి ఈ ఛార్జ్ షీట్ ను దాఖలు చేసినట్లు న్యాయస్థానం విచారణ సందర్భంగా వెల్లడించింది. చట్టప్రకారం దీన్ని పరిగణనలోకి తీసుకోవడం కుదరదని స్పష్టం చేసింది.

# డివిజన్లు ఏ ప్రతిపాదికన?

## అసహనం వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు

## డివిజన్ల పునర్విభజనపై.. జీహెచ్ఎంసీ ప్రత్యేక కౌన్సిల్

## బీజేపీ కార్పొరేటర్ల ఆందోళన

**హైదరాబాద్, ప్రజాస్వరం**

డివిజన్ల విభజన ఏ ప్రాతిపదికన చేశారో తెలియట్లేదని ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జీహెచ్ ఎంసీ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ప్రారంభమైంది. డివిజన్ల డీలిమిటేషన్ ప్రిలిమినరీ నోటిఫికేషన్ ను అధికారులు సభలో ప్రవేశపెట్టారు. డివిజన్ల విభజనపై ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తో పాటు కార్పొరేటర్లు మాట్లాడారు. డీలిమిటేషన్ పై తమ అభ్యంతరాలను సభ దృష్టికి తీసుకెళ్లారు.



### ప్లకార్డులు పట్టుకొని నిరసన

డివిజన్ల పునర్విభజనకు వ్యతిరేకంగా జీహెచ్ ఎంసీ కార్యాలయం వద్ద బీజేపీ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. తమను సంప్రదించకుండా డివిజన్ల పెంచుతున్నారని ఆందోళన చేపట్టారు. ఎంఐఎంకు అనుకూలంగా బీఆర్ ఎస్, కాంగ్రెస్ పునర్విభజన చేపట్టాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీను ఓడించేందుకు ఆ మూడు పార్టీలు ఏకమయ్యాయన్నారు.

# హైదరాబాద్‌లో దారుణం

**మూడో అంతస్తు నుంచి బిడ్డని విసిరేసిన తల్లి..**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

మూడవ అంతస్తు భవనం నుంచి బిడ్డను కిందికి విసిరేసింది కన్న తల్లి. ఈ ఘటన హైదరాబాద్ సిటీలో జరిగింది. ఈ ఘటనలో చిన్నారి స్పాట్ లో మృత్యువాత పడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మేడ్చల్ మల్కాజ్ గిరి ప్రాంతంలో జరిగిన ఘటన. ఏడేళ్ల బాలికను మూడో అంతస్తు నుంచి కిందకు తోసేసింది. మల్కాజ్ గిరి వసంతపురి కాలనీలో మోనాలిసా అనే మహిళ నివాసం ఉంటోంది. ఆమెకు ఏడేళ్ల షారోని మేరి కూతురు ఉంది. ఉన్నట్టుండి ఏమైందో తెలీదుగానీ ఆ చిన్నారిని తల్లి మోనాలిసా మూడో అంతస్తు నుంచి కిందకు విసిరేసింది. ఈ ఘటనలో షారోని మేరీకి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇరుగు పొగురువారు అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. వెంటనే చిన్నారిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు

## ఆసిఫాబాద్ జిల్లాలో 16 మంది మావోయిస్టుల అరెస్టు

**ఆసిఫాబాద్, ప్రజాస్వరం**

ఆసిఫాబాద్ జిల్లాలో 16 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. సిర్పూర్ (యు) మండలం బెద్దదోబలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. ఏఎస్పీ చిత్తరంజన్ ఆధ్వర్యంలో కూంబింగ్ నిర్వహించారు. అరెస్టయిన మావోయిస్టులను ఛత్తీస్‌గఢ్ వాసులుగా ఉర్తించారు. వారి నుంచి ఏకే 47, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని హైదరాబాద్‌కు తరలించారు.

# ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

**బస్సుల్లో మంటలు 13కు పెరిగిన మృతులు**

**లక్నో, ప్రజాస్వరం**



ఉత్తరప్రదేశ్ లో మంగళవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఢిల్లీ– ఆగ్రా ఎక్స్‌ప్రెస్ రహదారిపై పొగమంచు కారణంగా ఏడు బస్సులు, మూడు కార్లు ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. దీంతో భారీగా మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 13కు పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. మరో 75 మంది గాయపడినట్లు తెలిపారు. యమునా ఎక్స్‌ప్రెస్‌వే మార్గంలోని ఆగ్రా– నోయిడా క్యారేజ్ వేపై ఈ ప్రమాదం జరిగింది.

# ప్రధానితో సమావేశం విషయంలో తప్పుడు ప్రచారం

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, ప్రజాస్వరం**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిగిన సమావేశం విషయంలో తప్పుడు ప్రచారం జరుగుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రితో జరిగిన సమావేశంలో చర్చించిన అంశాలను బయటకు చెప్పొద్దని పీఎం స్వయంగా స్పష్టంగా సూచించారని కిషన్ రెడ్డి తెలిపారు. అయినప్పటికీ, లోపల జరిగినది ఒకటి కాగా బయట ప్రచారం చేస్తున్నది మరోలా ఉందని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి సంబంధించిన విషయాలను వక్రీకరించి ప్రచారం చేయడం అనుచితమని అన్నారు. ఆ సమావేశంలో తెలంగాణలో పార్టీ బలోపేతానికి సంబంధించి ప్రధానమంత్రి కీలక సలహాలు ఇచ్చారని కిషన్ రెడ్డి వెల్లడించారు. ముఖ్యంగా పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించాలన్న దానిపై దృష్టి పెట్టాలని, సోషల్ మీడియాలో యాక్టివిటీ పెంచాలని ప్రధాని సూచించినట్లు తెలిపారు. మొత్తానికి, ప్రధానమంత్రి తో జరిగిన అంతర్గత సమావేశాల విషయాలను బయటకు లీక్ చేయడం కచ్చితంగా తప్పని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

# ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు ఊరట

**వారికి అనుకూలంగా సుప్రీం తీర్పు**

**మల్లేశ్ పిటిషన్ కొట్టేసిన అత్యున్నత న్యాయస్థానం**

**ఢిల్లీ, ప్రజాస్వరం**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలో భూదాన్ భూముల వ్యవహారంపై దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఐఏఎస్ లు, ఐపీఎస్ లు కొనుగోలు చేసిన భూములపై బీర్ల మల్లేష్ అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ భూములను భూదాన్ భూములుగా పేర్కొంటూ తొలుత మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఐఏఎస్, ఐపీఎస్ లకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ మల్లేష్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ప్రాథమిక స్థాయిలోనే కొట్టివేసింది.

# రూపాయి మరింత పతనం

**తొలిసారి 91 మార్క్ దాటి సరికొత్త కనిష్ఠానికి..**

**ముంబయిప్రజాస్వరం**

అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. భారత్ –అమెరికా డీల్ పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో రూపాయి మారకం విలువ దారుణంగా పడిపోతోంది. నేటి సెషన్ లో తొలిసారి ఏకంగా 91 మార్క్ దాటి సరికొత్త జీవనకాల కనిష్ఠాన్ని తాకింది. క్రితం సెషన్ లో డాలరుతో పోలిస్తే 90.78 వద్ద ముగిసిన రూపాయి విలువ.. మంగళవారం మరింత పతనమైంది. ఉదయం 11.45 గంటల ప్రాంతంలో ఏకంగా 36 పైసలు తగ్గి 91.14 వద్ద ఆల్ టైం కనిష్ఠానికి పడిపోయింది. గత 10 ట్రేడింగ్ సెషన్లలోనే రూపాయి విలువ 90 నుంచి 91కి రావడం గమనార్హం. భారత్ –అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం ఆలస్యం వల్ల ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతినడంతో రూపాయిపై ప్రతికూల ప్రభావం పడుతోందని అనలిస్టులు చెబుతున్నారు.



# పశ్చిమ బెంగాల్లో 50 లక్షల ఓట్ల తొలగింపు



**ముసాయిదా ఓటరు జాబితా విడుదల**

**ఫిబ్రవరి 2026లో తుది లిస్టు**

కోలకత్తా, ప్రజాస్వరం

పశ్చిమబెంగాల్ లో ఎన్నికల సంఘం 58 లక్షల ఓట్లను తొలగించింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ముసాయిదా ఓటరు జాబితాను ఈసీ అధికారులు మంగళవారం విడుదల చేశారు. పేర్లు తొలగించిన ఓటర్లలో 24 లక్షల మంది మరణించారని, మరో 19 లక్షల మంది ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారని, 12 లక్షల మంది తప్పిపోయారని, 1.38 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇతర కారణాలతో మరో 57 వేల మంది పేర్లను తొలగించినట్లు తెలిపారు. వచ్చే శాసనసభ ఎన్నికల దృష్ట్యా రాష్ట్రంలో 'సర్' పనులను నవంబరు 4న ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారంతో పనులు ముగిశాయి. నేడు ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడంతో నేటినుంచి జనవరి 17 వరకు వీటిలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు తెలపడానికి ఓటర్లకు అవకాశం ఇవ్వనున్నారు. తుది ఓటర్ల జాబితాను ఫిబ్రవరి 2026లో ప్రచురిస్తారు.